ప్రజాశక్తి
బుధవారం 23 జులై 2025
5
పార్వతీపురం మన్యం

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం : అల్పపీడనం వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, కావున పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా, మండల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ఈనెల 24, 25 తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒడిషాలో భారీ వర్షాలు పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ – 08963 293046 ఏర్పాటు చేశామన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.హేమలత పాల్గొన్నారు.


సాలూరు, బలిజిపేటలో అచ్యుతానందన్ చిత్రపటాల వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు

అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

ప్రజాశక్తి – బలిజిపేట

కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్(101) మరణం సిపిఎం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం నాయకులు వై.మన్మథరావు, గేదెల సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అచ్యుతానందన్ 2006 నుంచి 2011 వరకు ఆయన కేరళకు ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. సిపిఎం స్థాపించిన వారిలో అచ్యుతనందన్ ఒకరన్నారు. లెనిన్, స్టాలిన్, మావోల జీవితాలతో పాటు ప్రపంచ కమ్యూనిస్టు చరిత్రలో అనేక కీలక ఘట్టాలను చూసిన అత్యంత అరుదైన నేత, కార్మిక ఉద్యమం నుంచి ప్రజానేతని కొనియాడారు. పేదరికం కారణంగా ప్రాథమిక స్థాయిలోనే చదువును ఆపేసి దర్జీ దుకాణంలో కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో పని చేస్తూ జీవనం సాగించిన అచ్యుతానందన్ కార్మిక ఉద్యమంలోకి అడుగుపెట్టారన్నారు. రాష్ట్రంలో భూ ఆక్రమదారులపై ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉక్కుపాదం మోపారన్నారు. అనేక నిర్బంధాలను ఎదురొడ్డి ప్రజల కోసం నీతి నిజాయితీగా నిలబడ్డారని, ఈరోజు అచ్యుతానందన్ మరణించినా ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అప్పుడే ఆయనకు మనం నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని అన్నారు. కార్యక్రమంలో పీసా వెంకటస్వామి, సత్యం, బి.భానుమూర్తి, మధు, ఆనందు, వెంకటరమణ, రాము, తదితరులు పాల్గొన్నారు

సాలూరు రూరల్: సాలూరు పట్టణంలోని కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్ చిత్రపటానికి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ వై నాయుడు మాట్లాడుతూ దేశంలో, అలాగే కేరళలో సిపిఎంను ముందు పీఠిన నిలపడంలో విఎస్ ఎనలేని కృషి చేశారని, నిరాడంబరమైన జీవనశైలి,

కొమరాడలో నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల సంతాప సభలు

సామాజిక న్యాయం పట్ల ఎంతో నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. సిఎంగా ఆయన పనిచేస్తున్న కాలంలో అతని హయాంలో శ్రమజీవుల సంక్షేమానికి అనేక పాలనాపరమైన చర్యలు తీసుకున్నారని, అది దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రజా పోరాటాలు నిర్మించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శంకర్రావు, రామకృష్ణ, పోలరాజు, స్వప్న, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కొమరాడలో కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్ చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ తన 17వ ఏటనే కమ్యూనిస్టు సభ్యుడిగా చేరి భూస్వాముల పోరాటంలో జైలుకెళ్లారన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజా సమస్యలే ఎజెండాగా ప్రజలే ఊపిరిగా అనేక పోరాటాలు చేపట్టారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాము, వెంకటేష్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

దబ్బగెడ్డకు జ్వరమొచ్చింది

- 25 రోజులుగా పీడిస్తున్న జ్వరాలు
- కీళ్ల నొప్పులు, వాపులతో కోలుకోలేకపోతున్న రోగులు
- పట్టని వైద్యాధికారులు

ప్రజాశక్తి – మక్కువ

గత 25 రోజులుగా ఆ గ్రామాన్ని జ్వరం బెంబేలెత్తిస్తుంది. ఇంట్లో ఒకరి తర్వాత ఒకరిని ఇబ్బందులు పాలు చేస్తుంది. సుమారు 350 ఆవాసాలు గల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ఎంపి వైద్యులను ఆశ్రయిస్తూ ఇంకా తగ్గుతుంటే పట్టణాలకు పోయి పరీక్షలు చేయించుకుని చికిత్స చేసుకుంటున్నారు. ఇటీవల ఓ ప్రైవేట్ సంస్థ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించింది. ప్రభుత్వ వైద్యాధికారులెవరు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...

మండలంలోని దబ్బగెడ్డలో జ్వరాలు విజృంభించాయి. ఈ గ్రామంలోని అందరి ఇళ్లల్లో ఒకరిద్దరు ఈ జ్వరం బారిన పడలేదని చెప్పుకోవడానికి లేదు. ఎక్కడి నుంచో ఓ వ్యక్తి ద్వారా ఈ జ్వరం వలస వచ్చిందని, ఇలాంటి జ్వరం తామెప్పుడూ చూడలేదని గ్రామస్తులు వాపోతున్నారు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, వాపులు విపరీతమైన నీరసం ఉందని అన్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి జ్వరాలు తగ్గించుకున్నా పూర్తిస్థాయిలో కోలుకోలేక నడవలేని స్థితి ఏర్పడుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరంతో బలివాడ గోవిందమ్మ, నారాయణమ్మ, లక్ష్మి, దాసరి వెంకటమ్మ, సాకేత్, హేమలత, నేరపిండి శ్రీను, కర్రి లీలావతి, వారణాసి తిరుపతిరావు, కలిశెట్టి సింహాచలవమ్మ, బూరి సరస్వతమ్మ, బండి గౌరమ్మ తదితరులు జ్వరంతో బాధపడుతున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటా రక్త నమోనాలు సేకరించి జ్వరాన్ని నయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒకరి ఇంటికి ఒకరు వెళ్లక..

గ్రామంలో ఒకప్పటి కరోనా కాలంలో ఏర్పడే స్థితిగతులు ఇప్పుడు కాన వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఇవి వైరల్ జ్వరాలా లేక ఇంకేమైనా అని ఇక్కడ స్థానికల్లో అనుమానం తలెత్తుతుంది. జ్వరం బారిన పడిన వ్యక్తిని ఇంట్లోకి వెళ్లకుండానే దూరం నుంచి పరామర్శించి వెళ్లిపోతుండడం స్థానికులు అంటున్నారు.

దబ్బగెడ్డలో జ్వరంతో బాధపడుతున్న మహిళ

కంబరవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి – వీరఘట్టం

మండలంలోని నడుకూరు సచివాలయం పరిధి కంబరవలసలో మంగళ వారం స్థానిక వైద్యాధికారి సాయి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శుభారతామని, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు హాస్టళ్లను సందర్శించాలి

ప్రజాశక్తి – పార్వతీపురం

జిల్లాలోని ప్రభుత్వ వైద్యాధికారులంతా తమ పరిధిలోని వసతి గృహాలను విధిగా సందర్శించి, విద్యార్థులను పరీక్షించి వారి బాగోగులను తెలుసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మలేరియా, డెంగీ, అనీమియా వంటి వాటితో బాధపడే విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. అలాగే ఎఎన్ఎం లేదా ఆశా వర్కర్లు ఎప్పటికప్పుడు వసతి గృహాలకు వెళ్లి విద్యార్థుల బాగోగులను తెలుసుకోవాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడే విద్యార్థులుంటే, పూర్తి వివరాలు తెలుసుకొని ఏమాత్రం అనుమానం ఉన్నా రక్త పరీక్షలు జరిపి వ్యాధి నిర్ధారణకు రావాలని అన్నారు. ఒకే వసతి గృహంలో ఎక్కువ మంది విద్యార్థులు అనారోగ్యానికి గురైనట్లయితే అక్కడ పారిశుధ్యం, తాగునీటి పరీక్షలను సంబంధిత అధికారుల ద్వారా చేపట్టి, అవసరమైన వైద్యం అందించాలని కలెక్టర్ తెలిపారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఆర్ఎంపి, నాటు వైద్యులను ఆశ్రయించకుండా ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సంచార వైద్యశాలల ద్వారా మారుమూల ప్రాంత ప్రజలకు వైద్యాన్ని అందించాలని తెలిపారు. ఫ్రైడ్ డ్రైడే యాక్టివిటీ బాగా జరగాలని, అనీమియా యాక్షన్ కమిటీలు చురుగ్గా పాల్గొని రక్తహీనత లేకుండా చూడాలని తెలిపారు. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలకు కేటాయించిన గిరిచైతన్య వాహనాల ద్వారా గిరిజన ప్రజలకు అన్ని విషయాలపై అవగాహన కల్పించి, చైతన్య పరచాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లలందరికీ జనన ధ్రువీకరణ పత్రాలను ఎఎన్ఎంల ద్వారా తల్లులకు ఇప్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మలేరియా, డెంగీ వ్యాధుల నిరోధక చర్యలు తీసుకోవాలన్నారు. తల్లీ బిడ్డల సేవల నమోదు ప్రక్రియ పక్కాగా జరగాలని, ప్రమాదకర గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. అభా ఐడీ నమోదు శత శాతం కావాలని, రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకునే వారికి జనని ఆరోగ్య రక్ష పథకం వర్తింపచేయాలని తెలిపారు. మాతా, శిశు మరణాలు ఉండరాదని, జాతీయ టీకాల కార్యక్రమం శత శాతం సాధించాలన్నారు. అసంక్రమణ వ్యాధుల సర్వే, స్క్రీనింగ్ చేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.బాస్కరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వై.మణి, ఐసిడిఎస్ పీడి డాక్టర్ టి.కనకదుర్గా, ఇతర వైద్యాధికారులు, డెప్యూటీ డిఎంహెచలు, ఆదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి – సాలూరురూరల్

తన మరదల్ని ప్రేమించొద్దని హెచ్చరించిన యువకుడిని ప్రేమికుడు హత్య చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని పురోహితునివలసలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని పెదబోరబంద పంచాయతీ దేవుబుచ్చంపేటకు చెందిన ఆటో డ్రైవర్ గుంట్రెడ్డి శ్యామ్ గత కొన్నేళ్లుగా పురోహితునివలసకు చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక బావ షేక్ జలీల్ (26) శ్యామ్‌ను హెచ్చరించారు. బాలిక పురోహితునివలస ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్ చదువుతుండడంతో ప్రతిరోజు ఆమె వెంట శ్యామ్ పడుతున్న విషయం గ్రామంలో అందరికీ తెలిసింది. దీంతో కోపోద్రుకుడై జలీల్ మళ్లీ శ్యామ్‌ను వారం రోజుల కిందట తీవ్రంగా హెచ్చరించి నువ్వు ఇదే పద్ధతి కొనసాగిస్తే నిన్ను చంపడానికి కూడా వెనుకాడనని హెచ్చరించాడు. అయినా శ్యామ్ బుద్ధి మారకపోవడంతో సోమవారం రాత్రి 9గంటల సమయంలో షేక్ జలీల్ తన స్నేహితులతో కలిసి పురోహితునివలస ప్రాథమిక పాఠశాల పక్కన మద్యం సేవించి ఈరోజు ఎలాగైనా శ్యాముకు గట్టిగా మందలించాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం తన స్నేహితుల్లో ఒకర్ని దేవుబుచ్చంపేట పంపించి శ్యామును పురోహితునివలసకు రప్పించాడు. అంతా కలిసి మద్యం సేవించారు. షేక్ జలీల్ శ్యామ్‌ను భయపెట్టడానికి పథకం ప్రకారం ఒక కత్తిని కూడా తన వెంట తెచ్చుకున్నాడు. ఆ కత్తితో శ్యామ్‌పై దాడి చేయగా అదే కత్తిని శ్యామ్ తీసుకొని జలీల్ పొట్టపై పొడిచి హత్య చేశాడు. షేక్ జలీల్ అక్కడికక్కడే మరణించాడు. హత్య చేసిన శ్యామ్ పోలీసుల వద్ద లొంగిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు పోలీసులకు సమాచారం అందించగా మంగళవారం ఉదయం ఘటనాస్థలానికి రూరల్ పోలీసులు చేరుకొని హత్య చేయబడిన ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పి.రామకృష్ణ తెలిపారు. రూరల్ ఎస్సై నరసింహామూర్తి, మక్కువ ఎస్ఐ వెంకటరమణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యకు గురైన షేక్ జలీల్

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి – కురుపాం

స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె. రాజు, సహాయ కార్యదర్శి హెచ్.సింహాచలం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని వబ్బంగి పంచాయితీ భీంపురం గ్రామానికి చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థి ఉయక సౌమ్య మృతి చెందిన విషయమై విద్యార్థులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు భోజనానికి డైనింగ్ హాలు సదుపాయం సక్రమంగా లేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాగే కిటికీలకు మెస్‌లు లేక దోమలు, ఈగల బారిన పడి విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి డైనింగ్ హాల్ సదుపాయం కల్పించి అన్ని కిటికీలకు మెస్సులు బిగించి విద్యార్థులెవరూ రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కారక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తకు మెమో

ప్రజాశక్తి – సాలూరు

మండలంలోని నెలిపర్తి అంగన్వాడీ కార్యకర్త రాధకు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు మంగళవారం చార్జి మెమో జారీ చేశారు. ఈ గ్రామానికి చెందిన కొంతమంది టిడిపి నాయకులు ఫోన్ చేసి అంగన్వాడీ కేంద్రానికి వచ్చే సరుకుల వివరాలు ఎప్పటికప్పుడు తనకు చూపించాలని హెచ్చరించడాన్ని విలేకరులకు తెలియజేసినందుకు ఆమెకు మెమో జారీ చేశారు. 48 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఇదిలా అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్ వైజర్ లీలావతి పరిశీలించారు. వారి తనిఖీల్లో ఏవిధమైన లోపాలు కనిపించలేదు. మంగళవారం కూడా ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకదుర్గ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కెమిశీల హెచ్‌ఎంకు షోకాజ్

ప్రజాశక్తి – కొమరాడ

మండలంలోని కెమిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల నిర్వహణ పట్ల ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అసంతృప్తి వ్యక్తం చేసి ఆపాఠశాల ప్రధానోపాధ్యాయునికి షో కాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కెమిసిల పాఠశాలను, పలు అభివృద్ధి కార్యక్రమాలను పిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టీని తనిఖీ చేసిన పిఒ సగానికి పైగా విద్యార్థులు హాజరు కాకపోవడాన్ని గమనించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన పిఒ ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను తయారు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల హాజరు పట్టీతో సహా ఇతర రిజిస్టర్ల నిర్వహణ లేకపోవడం పట్ల ప్రశ్నించారు. పాఠశాల ఆవరణ తుప్పలు, డొంకలతో నిండి ఉండడాన్ని గుర్తించి ప్రధాన ఉపాధ్యాయుడిని ప్రశ్నించారు. ఎంపిడిఒ రమేష్‌కు అక్కడ నుండే ఫోన్ చేసి పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాఠశాల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆహారం తదితర అంశాల నిర్వహణ సంతృప్తికరంగా లేకపోవడంతో షో కాజ్ నోటీసు జారీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులను ఆదేశించారు. ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు, ఆహార వసతులు, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు తరచూ తనిఖీలు నిర్వహించి ఆశ్రమ పాఠశాలలు మంచి ప్రమాణాలతో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

గుండ - బిన్నిడి రహదారి పరిశీలన

పర్యటనలో భాగంగా మండలంలో గుండ – బిన్నిడి రహదారిని పిఒ తనిఖీ చేశారు. ఎగువ గుండ – సవర గుండ రహదారిని కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

సమ్మె పిలుపుతో దిగొచ్చిన ఆర్‌టిసి అధికారులు

- యజమానులతో చర్చలకు సన్నద్ధత
- జీతాల పెంపునకు అంగీకారం
- అమలు కాకపోతే 28 నుంచి సమ్మె

ప్రజాశక్తి – పార్వతీపురం

తమ డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేయనున్నట్టు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్ల సంఘం పిలుపునిచ్చింది. దీంతో సోమవారం రాత్రి స్థానిక ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్లు యూనియన్ నాయకులు, సిఐటియు నాయకులు, యజమానులు డిపో మేనేజర్ వద్ద జరిగిన చర్చల్లో స్వల్ప పురోగతి లభించింది. దీంతో డ్రైవర్లు సమ్మెను ఈనెల 28కి వాయిదా వేశారు. గత 20 రోజులుగా ఆర్టీసీ డ్రైవర్ల డిమాండ్లపై పోరాటం నేపథ్యంలో లేబర్ కమిషనర్ సువర్ణ వద్ద జరిగిన చర్చలు ఫలించలేదు. దీంతో డ్రైవర్లు సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా రవాణా అధికారి సమక్షంలో యూనియన్ నాయకులు, బస్సు యజమానులతో చర్చలు జరిగాయి. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరాము చర్చలకు హాజరయ్యారు. నాలుగేళ్ల నుంచి పెంచని జీతాలు పెంచేలా చూడాలని కోరారు.

జిల్లా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావుతో యూనియన్ నాయకులు ఈనెల 21న సాయంత్రం చర్చలు జరిగాయి. డిమాండ్ల పత్రంలోని అంశాలు యజమానుల ముందుకు ఉంచగా ఆ రేట్లు ఇవ్వలేమని వారు స్పష్టం చేశారు. యజమానులంతా ఒటి చేసే డ్రైవర్‌కు రూ.16వేలు పెంచాలని కోరారు. డే అవుట్‌కు ఇస్తున్న జీతంపై నెలకు అదనంగా రూ.1500 నైట్ అవుట్ డ్యూటీలకు రూ.2000 పెంచాలని యూనియన్ నాయకులు కోరగా యజమానులు ససేమిరా అంగీకరించలేదు. రాత్రి 10గంటల వరకు చర్చలు జరిగాయి. యజమానులు అంగీకరించకపోతే సమ్మె జరుగుతుందని కమిటీ అనడంతో యజమానులు చర్చల్లో అందరూ స్పందిస్తూ ఇపుడు ఇస్తున్న జీతంపై పెంచడానికి నెలకు డ్రైవర్లకు ఒటి వేతనం రూ. 750, డే ఆఫ్ డ్యూటీ డ్రైవర్‌కు వెయ్యి, నైట్ ఆఫ్ డ్యూటీ డ్రైవర్‌కు రూ.1500 పెంపునకు అంగీకరించారు. మిగిలిన డిమాండ్లు చర్చించ లేదు. వేతనకాలం రెండున్నరేళ్ల అన్నారు. బయటికి వచ్చి ఈ విషయం కార్మికులకు కమిటీ తెలపగా కార్మికులు ఈ పెంపు చాలదని తెలుపగా యాజమాన్యాలకు విషయం తెలిపారు. యజమానులు స్పందించి కొంత జీతం పెంచడానికి ముందుకొచ్చినందున సమ్మె వాయిదా వేసి డిమాండ్లు పై జూలై 28 వరకు మళ్లీ చర్చలు కొనసాగాలని యూనియన్ నాయకులు నిర్ణయించారు. దీంతో చర్చలు ఈనెల 28కి వాయిదా వేశారు. చర్చల్లో యజమానులు, డిపో మేనేజర్, యూనియన్ తరపున సెక్రటరీ టిడి ప్రసాదు, ఆఫీస్ బేరర్లు పిడి ప్రసాదు, కె.వీరాచారి, ఎస్.మన్మధరావు, అశోక్, రాంబాబు, సిఐటియు నాయకులు రెడ్డి వేణు, బివి రమణ పాల్గొన్నారు.

డిపో వద్ద నిరసన తెలుపుతున్న అద్దెబస్సు డ్రైవర్లు, సిఐటియు నాయకులు

టిడిపి కార్యకర్తపై మంత్రి అనుచరుడి కక్షసాధింపు?

ప్రజాశక్తి – సాలూరు

మండలంలోని నెలిపర్తికి టిడిపి నాయకుడు లింగాల రాజారావుపై సాక్ష్యాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అనుచరులు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజారావు టిడిపి ఆవిర్భావం నుంచి ఆపార్టీ కార్యకర్తగా, గ్రామ ఉపసర్పంచ్‌గా పని చేశారు. అయితే మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ అనుచరుడిగా ఉండడమే ఆయనకు ఈరోజు శాపంగా మారుతోంది. మంత్రి అనుచరుడైన ఆ గ్రామ టిడిపి అధ్యక్షులు లింగాల గాంధీ రాజారావును వేధింపులకు గురి చేస్తున్నారు. రాజారావు భార్య గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తున్నారు. నీ భార్య ఉద్యోగం ఎలా చేస్తుందో చూద్దామని గాంధీ రాజారావును బెదిరిస్తున్నారు. ఇటీవల టిడిపి నాయకుడు గాంధీ రాజారావు భార్యకు ఫోన్ చేసి అంగన్వాడీ కేంద్రానికి వచ్చే సరుకుల వివరాలు ఎప్పటికప్పుడు తనకు చూపించాలని డిమాండ్ చేశారు. చూపించకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటావన్న రీతిలో హెచ్చరించారు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన రాజారావు టిడిపి కార్యకర్తగా ఉన్న తనకు ఇన్ని ఇబ్బందులు ఎదురవుతుండడం బాధగా ఉందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా తాను ఇంతగా వేధింపులకు గురి కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.



గుమ్మలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మ, ఏగులవాడ పంచాయతీల్లో మండల టిడిపి కన్వీనర్ కె.వి.కొండయ్య ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి ప్రజలకు వివరించి వారి వ్యక్తిగత సమస్యలు, గ్రామానికి కావాల్సిన సౌకర్యాల గురించి తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలుతీసుకొని హామీ ఇచ్చి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు వెంపటాపు భారతి, కర్రి శ్రీను, సుభాష్ చంద్ర పండా, ఆకుల రమేష్, బలగ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాలు పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ పరిధిలో గల లోడగల వీధి సమీపంలో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నారన్న ఫిర్యాదు అందడంతో తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ఐ బాబూరావు, వీఆర్వోలు కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలాన్ని చదును చేస్తున్న విషయాన్ని గుర్తించి వారికి నోటీసులు అందిస్తామని చెప్పారు.

జీవన ప్రమాణాలు మెరుగు పరచాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అట్టడుగు ఉన్న 20 శాతం కుటుంబాలకు జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు వీలుగా టాప్‌లో ఉన్న 10 శాతం కుటుంబాలను దత్తత తీసుకోవడం పి ఫోర్ ఉద్దేశమని ఎంపిడిఒ బి.వెంకటరమణ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని చలివేంద్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామంలో పి4 సర్వే చేపట్టాలని సూచించారు. తలవరం, పనస నందివాడలో కూడా పి4 గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిహెచ్ మధుసూదనరావు, ఎంపిటిసి బొమ్మల ప్రకాశరావు, హౌసింగ్ ఎఇ వినోద్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ డి.కామేశ్వరి, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం రామ మందిరం వద్ద మంగళవారం పి4పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని ముందుగా గ్రామంలో సర్వే చేశారు. అనంతరం దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాలను ఎంపిక చేసుకొని వాటిని బంగారు కుటుంబాలుగా తీర్చుకునే బాధ్యత ఉంటుందన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఇప్పటికే గ్రామం నుంచి 20 కుటుంబాలను పెంపునకు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి క్రాంతి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డిపిఒ కొండలరావు

పంచాయతీని అభివృద్ధి పరచాలి

ప్రజాశక్తి - కురుపాం

పంచాయతీని పారిశుధ్యం, తాగునీటి సమస్య లేకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలని డిపిఒ కొండలరావు అన్నారు. మండలంలోని బియ్యాలవలస పంచాయతీని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి చెత్త సేకరణ కేంద్రాన్ని, తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సమస్య, విద్య, వైద్యం, మౌలిక వసతులు పొందుతున్న తీరును వారిని అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేసి పంచాయతీ కార్యదర్శి వై. వెంకటనాయుడును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ప్రజలతో మమేకమై పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుండడం ఆనందదాయకంగా ఉందని, కావున పంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామస్తులను అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పువ్వల అజ్జారి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నిరసన దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో గతంలో గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు చేసిన "ఆదివాసీ ఆరోగ్యం "(ఎఎన్ ఎమ్)సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యాన స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, నాయకులు తాడంగి గణేష్, ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది సుజాత, గౌరీశ్వరి, అరుణ, అమల, గోపాల్, కష్ణా రావు, చందు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైద్య సిబ్బందిని నియమించి గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సందేహాలుంటే ఫిర్యాదు చేయొచ్చు

ప్రజాశక్తి - వీరఘట్టం

భూ రీ సర్వేలో ఎలాంటి సందేహాలున్నా ఫిర్యాదు చేయవచ్చునని స్థానిక తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు రైతులకు సూచించారు. మండలంలోని తూడి గ్రామ రైతులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలుంటే సభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి జి.ప్రసాదరావు, గ్రామ జనసేన నాయకులు రౌతు నవీన్ కుమార్, చందక నారాయణరావు, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కు సన్మానం

గ్రామంలో జరిగే భూ రీసర్వే సమావేశానికి విచ్చేసిన తహశీల్దార్ కామేశ్వరరావును జనసేన నాయకులు రౌతు నవీన్ కుమార్ దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ తూడి గ్రామ భూ సమస్యకు సంబంధించి రైతుల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు వచ్చిన సమస్య పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని సన్మాన గ్రహీతను కోరారు. కార్యక్రమంలో చందక నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ కామేశ్వరరావు

పారిశుధ్య పక్షోత్సవాలు ఎక్కడ?

రోడ్డుపైనే మురుగునీరు
వీధుల్లో చెత్తకుప్పలు

ప్రజాశక్తి - పాలకొండ

ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య పక్షోత్సవాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా పలు గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా అ పనులు చేపట్టిన దాఖలాల్లేవు. ఇందుకు నిదర్శనం ఎక్కడిక్కడ చెత్తకుప్పలు, కాలువల్లో ప్రవహించాల్సిన మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లుపైనే చెత్త ఎక్కడికి అక్కడ దర్శనమిస్తుంది. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 20 వార్డుల్లో 354 వీధుల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. గురువుగారు వీధి, కోమటిపేట జంక్షన్, ఇందిరానగర్ కాలనీ, లుంబురు వారి వీధి జంక్షన్‌తో పాటు ప్రధాన రహదారుల్లోనూ రోడ్లపైనే చెత్తలు కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షాలు కురవడంతో మరింత బురదమయంగా మారుతుంది. దీనికి తోడు నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. పట్టణం రోజురోజుకు విస్తరిస్తుంది. జనాభా సుమారు 40 వేలు పైబడి ఉంది. ఆ స్థాయిలో పారిశుధ్య కార్మికులు లేరు. కేవలం 46మందితోనే పారిశుధ్య నిర్వహణ జరుగుతుంది. పారిశుధ్య కార్మికులు ఉద్యోగులుగా రికార్డుల్లో నమోదై ఇతర పనులు చేస్తున్నారు. ఏదేమైనా నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణలో మాత్రం లోపం కనిపిస్తుంది.

వీరఘట్టం పాతబస్టాండ్ వెళ్తే రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

పాలకొండ పట్టణంలోని కోమటిపేటలో పేరుకుపోయిన చెత్తకుప్ప

కానరాని పారిశుధ్య పక్షోత్సవాలు

వీరఘట్టం : స్థానిక మేజర్ పంచాయతీలో అపారిశుధ్యం తాడవిస్తోంది. పాత బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపై మురికి నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి విస్తీర్ణ పనుల్లో భాగంగా పాత బస్టాండ్‌యఅ వెళ్లే మార్గంలో ఒకవైపు ఉన్న కాలువను పాత బస్టాండ్ వైపు మళ్లించారు. దీంతో చిన్నపాటి చినుకుపడ్డా ఈ కాలువ గుండా నీరు వెళ్లలేక రహదారిపై నిలిచిపోతుంది. కొంతమంది వ్యాపారులు కాలువపై అక్రమ కట్టడాలు నిర్మించడంతో వర్షం పడిన ప్రతిసారి ఇదే సమస్య ఏర్పడుతుంది స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే మేజర్ పంచాయతీ అధికారుల స్పందించి అక్రమణలను తొలగించి మురికి నీరు కాలువ గుండా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే పలు గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులను వేరే భవనాలకు తరలించండి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ సమీపాన గల గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం సందర్శించారు. గురుకుల పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సమీపంలో ఉన్న గురుకుల కళాశాల భవనంలో నాలుగు గదుల్లో ఈ విద్యార్థులను తాత్కాలికంగా చేర్పించాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు. అంతేకాకుండా రైతు సేవా కేంద్రం మరమ్మతు చేసి తాత్కాలికంగా ఉండడానికి ఏర్పాటు చేస్తామని అన్నారు. గురుకుల పాఠశాల భవనం మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనం, విద్యార్థుల విద్యా ప్రమాణాలు తెలుసుకున్నారు. అంతా బాగానే ఉండడంతో సంతృప్తి చెందినట్లు తెలిసింది. ఆయనతో పాటు ఎపిఒ జి.చినబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వి ఎస్ ఎన్ కుమార్, ప్రిన్సిపల్ జి.నీలం నాయుడు, డిప్యూటీ వార్డెన్ ఎం.మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వర్కర్లను కొనసాగించాలని జెడికి వినతి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో గతంలో పనిచేసిన ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించాలని ట్రైబల్స్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు మోజు తేజావతి, నాయకులు సవర మాలయ్య గిరిజన సంక్షేమ శాఖ జెడి సరస్వతికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టళ్లలో ఇదివరకు ఉన్న హెల్త్ వర్కర్లను గతంలో తొలగించారని, ఇప్పుడు మళ్లీ వారిని కొనసాగించాలని కోరారు. వీరివల్ల గిరిజన విద్యార్థుల ఆరోగ్యం బాగుంటుందని జెడికి వివరించారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో బిచ్చుమాను గూడా, జియమానుగూడ, కోసమానుగోడలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామాల్లో పరిశుభ్రత, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని గ్రామస్తులకు తెలిపారు. గ్రామాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ కూడా పూర్తి చేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఇఒ నూక నాయుడు, పిహెచ్ఎన్ సరస్వతి, వైద్య సిబ్బంది ఉన్నారు.

సారా తయారీ నిల్వలు స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని పాతరెల్లి వీధి, ఇందిరా కాలనీల్లో ఎక్సైజ్, టాస్కోఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలు ఎస్.సంతోష్ జీవన్, కిషోర్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు నిర్వహించి సారా నిల్వలు, తయారీదారులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు ఇందిరా కాలనీలో సారా ప్యాకెట్లు తయారు చేస్తున్న ఎస్.వినోద్, సుమలత నుంచి వంద సారా ప్యాకెట్లను, పాత రెల్లి వీధిలో డి.సోకు, సుజాత, అమర్నాథ్ నుంచి 120 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఈ ఐదుగుర్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఆటోపై అక్రమంగా రవాణా చేస్తున్న 400 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని, రవాణా చేసిన వారు తప్పించుకున్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు. గత మార్చి నుండి ఇప్పటి వరకు అంతర్రాష్ట్ర దాడులు నిర్వహించామన్నారు. సారా తయారీకి ఉపయోగించే అమోనియం, నల్లబెల్లం ధ్వంసం చేశామన్నారు. ప్రస్తుతం ఉన్న చెక్ పోస్టులతో పాటు ఆర్కే బట్టి వలస, మారికి, రాధం పేట, విక్రాంపురం గ్రామాల పరిధిలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి సారా రవాణా అరికడతామన్నారు. జిల్లాలో 137 సారా అమ్మకాల గ్రామాలను గుర్తించామని, నవోదయం కార్యక్రమం ద్వారా ఇప్పటికే 110 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా మార్చినట్టు తెలిపారు. ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన 45 మందిని గుర్తించామని, వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. త్వరలో వారి చేత సారా రవాణా వృత్తిని మాన్పించి స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే గుమ్మడి గ్రామానికి చెందిన ఆర్.వినోద్‌పై పీడీ యాక్ట్ పెట్టినట్టు తెలిపారు. సారా తయారీ, అక్రమ రవాణాకు 24 గంటలు నిఘాను ఏర్పాటు చేయడమే కాకుండా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డ నాటుసారా తయారీదారులు

పనుగుపేటలో ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

పనుగుపేటలో బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుగుపేటలో మంగళవారం బాబు షూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపిఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు చేయడంతో విఫలమైందని విమర్శించారు. ఇప్పటికీ రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, సూపర్ సిక్స్ పథకాల్లో ఏవీ అమలు చేయలేదన్నారు. ఈ విధానాలను ప్రజలు అర్థం చేసుకొని భవిష్యత్తులో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, నియోజక వర్గం రైతు విభాగం అధ్యక్షులు ఆర్వీ పార్థసారథి, మండల నాయకులు ఎన్.గోపాలం, ఎం.ధనుంజయనాయుడు, వై.శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ బంకురు పద్మావతి సత్యం నాయుడుతో పాటు మాజీ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల నమూనాలతో ఆర్థికాభివృద్ధి : డిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పంటల నమూనాతో రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించ వచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ శ్రావణ్ కుమార్ నాయుడు తెలిపారు. మండలంలోని దుడ్డుఖల్లులో రాయగడ జమ్మూ, గొయ్యి పాక, సిహెచ్ బిన్నిడి యూనిట్లకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ప్రప్రథమంగా తమ పూర్తి స్థాయి విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి ఎంటిఎం, ఎ గ్రేడ్, ఎ గ్రేడ్ ప్లస్, డిఆర్‌పిఎం, వరి గట్లు వెడల్పులో ఆకు, కూరగాయలు, పండ్ల మొక్కలు, తీగ జాతులు వేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యకర్తలకు సంబంధించిన గ్రామాల్లో రైతులు ఆదర్శవంతంగా ఉండేలా రైతులచే పంటల నమూనాలు, వారు ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేయాల్సిన బాధ్యత వ్యవసాయ కార్యకర్తలపై ఉందన్నారు. గిరిజన ప్రాంతంలోని నేల పసుపు, అల్లం, ఫైనాపిల్, కర్రపెండ్లం మొదలగు పంటలు వేసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉందన్నారు. జిల్లాలో జట్టు సంస్థ సూచనలు, సలహాలు, కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కావున వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు, శ్రీ రాగి, శ్రీ వరి, చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. మారుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ ఉత్పత్తులు జోడించి అధిక దిగుబడులు సాధించేలా కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎడిఎ రెడ్డి అన్నపూర్ణ, జట్టు సంస్థ కో ఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు, మండల మోడల్ థి మోటిక్ లీడ్ గణేష్ శరత్ చంద్ర, యంగ్ ప్రొఫెషనల్ రవి తేజ, జీవ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.ప్రోబోద్ మండల ఇన్‌ఛార్జి యం.సీతారాం ు పాల్గొన్నారు.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్నడిపిఎం శ్రావణ్‌కుమార్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెద్ద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.సాయి రమ్య ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ ఉచిత వైద్య శిబిరానికి రోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని అన్నారు. దోమలను నివారించేందుకు పిచికారీ చేయాలన్నారు. జ్వరాలు, దగ్గు, తలనొప్పి ఉంటే వ్యాధులతో బాధపడే వారు తనిఖీలు నిర్వహించారు. వీరికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సాయి రమ్య

పచ్చిరొట్ట ఎరువులతో మట్టికి జీవం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పచ్చిరొట్ట ఎరువులతో మట్టికి జీవం వస్తుందని, భూమి సారవంతమవుతుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గుమ్మలక్ష్మీ పురం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ రూపొందించిన పచ్చిరొట్ట విత్తనాలు పోస్టర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవన ఎరువులతో పంటకు బలం వస్తుందన్నారు. పది శాతం ఎరువులు ఆదా చేయొచ్చని తెలిపారు. అనంతరం 100శాతం రాయితీపై వరి నాట్ల యంత్రాలను పివిటిజి రైతులకు అందజేశారు. ఐటిడిఎ, వ్యవసాయశాఖ సహకారంతో ఈ యంత్రాలను పంపిణీ చేశామన్నారు. వీటి ద్వారా రైతులకు సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని అన్నారు. కావున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎడిఎ అన్నపూర్ణ, పిఎఒ శ్రీనివాసరావు, గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎఒలు శంకరరావు, కురుపాం నాగేశ్వరరావు, ఎఇఒ శివ, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎంతో ప్రయోజనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కురుపాం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని కోసింగిభద్ర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

గోతులను కప్పించిన ఎస్ఐ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినభోగిలి రైల్వే దగ్గర పాడైపోయిన జాతీయ రహదారి గోతులను ఎస్సై ఎం.రాజేష్ దగ్గరుండి గోతులను కప్పిస్తున్నారు. గత 20 రోజులుగా వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఇటీవల పలు పత్రికల్లో రోడ్డు దుస్థితిపై కథనాలు వచ్చినా ఆర్‌అండ్‌బి, రైల్వే అధికారులు పట్టించుకోకపోయినా పోలీస్ అధికారులు పట్టించుకోవడంతో ప్రయాణికులు, ప్రజలు అభినందిస్తున్నారు.

చేసింది తక్కువ... చెప్పకునేది ఎక్కువ : కాంగ్రెస్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రజలకు, ముఖ్యంగా రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒరగబెట్టిందేమీ లేదని, అయినా సుపరిపాలన పేరిట గడప తొక్కే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి 'ఔరా ' అనిపించుకుంటున్నారని కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్‌కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైస్ కార్డులు, పింఛన్లు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయపు సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో విఫలమైందని విర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదన్నారు. గిరిశిఖర గ్రామాలల్లో సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నేటికీ డోలీమోతలు తప్పడం లేదని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించాల్సిన అత్యవసర సేవలను గాలికి వదిలేసి, యోగాంధ్ర, మెగా పిటిఎం, అమరావతిలో ఐకాన్, క్వాంటం వ్యాలీ వంటి నిర్మాణాలకు తహతహలాడుతూ లక్షల కోట్లు మంజూరంటూ కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రతి చిన్న పనికి భూతద్దంలో చూపిస్తూ" గిన్నిస్ రికార్డ్" లలో నమోదయ్యేంతగా తమకు తామే డిక్లరేషన్లు ఇచ్చుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. దీన్ని కాంగ్రెస్ తీవ్రంగా నిరసిస్తోందని చిన్నారావు తెలిపారు.

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిలో ఉన్న వానపాములు, అనేక సూక్ష్మజీవులు నశిస్తున్నాయని కావున అవసరమైనంత మేరకు మాత్రమే రసాయన ఎరువులు వాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దమ్ముకు వారం రోజుల వ్యవధి ఉంచాలని, ఒక చదరపు మీటరు కనీసం 33 కుదుర్లు ఉండేలా నాటుకోవాలని, బురదపదునులో తేలిక పాటి నాట్లు వేసుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులను దమ్ములో మాత్రమే వేసుకోవాలన్నారు. పొటాష్ ఎరువులు రెండు భాగాలుగా చేసుకుని దమ్ములో ఒక భాగం చిరుపొట్ట దశలో రెండో భాగం వేసుకోవాలని సూచించారు. విచక్షణా రహితంగా పురుగు మందులు వాడడం వల్ల నష్టపర్చవనుకున్న పురుగుల ఉధృతి పెరిగి నష్టపరిచే స్థాయిని దాటుతున్నాయని అన్నారు. గతేడాది ఆర్‌జిఎల్ వరి రకంలో వచ్చిన రెల్లరాల్చు పురుగు గతంలో ఎన్నడూ నష్ట పరిమితి స్థాయిని దాటలేదని తెలిపారు. ముందుగా వేప నూనె, కషాయం వంటి వాటిని వినియోగించుకోవాలన్నారు. సుడోమానాస్ ట్రైకోడెర్మా వంటి వాటితో తెగుళ్లను నివారించుకోవాలని సూచించారు. అనంతరం జామ తోటలో క్షేత్ర ప్రదర్శన చేసి జామ పండించే విధానాన్ని రైతులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఇఒ నాగమణి, విఎఎ లావణ్య, ప్రకృతి సేద్యవి-2 విజయ్ పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెద్ద అంకలాంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు కౌలు కార్డు చేసుకోవాలన్నారు. అలాగే ఎరువులకు సంబంధించి ఇప్పటి వరకు రైతు సేవ కేంద్రాలు ద్వారా యూరియా 430 మెట్రిక్ టన్నులు, డిఎపి 265 మెట్రిక్ టన్నులు ఇప్పటి వరకు సరఫరా చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ సంబంధించి లబ్ధిదారుల జాబితా ప్రకారం రైతులకు త్వరలో జమ అవుతుందని తెలపడం జరిగింది. ముఖ్యంగా పంట బీమాకు సంబంధించి వరి పంటకు ఎకరాకు రూ.800 బీమా కవరేజ్ రూ.40వేలు, పత్తి పంటకు ఎకరాకు రూ.1923, బీమా కవరేజ్ రూ.38వేలు, మొక్కజొన్న పంట ఎకరాకు రూ.334కు గానూ బీమా కవరేజ్ రూ.33,400, అరటి పంటకుఎకరాకు రూ.3036, బీమా కవరేజ్ రూ.60వేలు చెల్లించాల్సిందిగా రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, వసిబ్బంది రైతులు పాల్గొన్నారు

మోతాదుకు మించి యూరియా వాడొద్దు : ఎఒ

సాలూరురూరల్ : యూరియాను మోతాదు మించి వినియోగించొద్దని మండల వ్యవసాయ అధికారి కె. శిరీష రైతులకు సూచించారు. మండలంలోని కందులపదం, మావుడిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఒ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తిరపురుగు యాజమాన్య పద్ధతులు వివరిస్తూ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోఎట్ అనే రసాయన మందును పిచికారీ చేయాలని, యూరియాను అధిక మొత్తంలో వినియోగించడం వల్ల పురుగులు, తెగుళ్ల బెడద అధికం అవుతుందని అన్నారు. యూరియాకు బదులు నానో యూరియాను ఉపయోగించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్లో వరి నారుమడుల్లో జింక్ లోపం ఉన్న చోట జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కౌలుకు తీసుకున్న రైతులు ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో ఉండే సచివాలయం వద్ద రెవెన్యూ అధికారుల నుంచి కౌలు సర్టిఫికెట్లను పొందాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ, విఎఎ, రైతులు, రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అజోల్లతో అధిక ప్రయోజనాలు

గుమ్మలక్ష్మీపురం : అజోల్లతో రైతులకు అధిక ప్రయోజనాలు కలుగుతాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ అన్నారు. జియ్యమ్మ వలస మండలం గవరంపేటలో రైతు వంగపండు సన్యాసినాయుడు క్షేత్రంలో వరి రకం ఆర్‌జిఎల్‌లో వేయించారు. వరి ఉబాలు చేసిన తర్వాత ఎకరాకు నాలుగు కేజీలు చొప్పున అజోల వేసుకోవడం వల్ల కొద్ది రోజుల తర్వాత పొలం మొత్తం వ్యాపిస్తుందన్నారు. ఇది బయో ఫెర్టిలైజర్‌గా ఉపయోగపడుతు ందని, ప్రోటీన్ 20 నుంచి 30 శాతం లభిస్తుందని, పాల దిగుబడి, వెన్న శాతం పది నుంచి పదిహేను శాతం పెరుగుతుందని, ఆజోల్ల కోళ్ళు, గొర్రెలు, మేకలు, పందులు, కంజు పిట్టలు, బాతులు, చేపలకు, పశువులకు దాణాగా ఉపయోగపడుతుందని అన్నారు. యూరియా బదులుగా రైతులు ఆజల్లా వేసి పంటలు పండించుకుని, పెట్టుబడులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ రవితేజ, మండల ఇన్చార్జి బి. ధనుంజయరావు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.